సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: విమ్స్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్–3 ఈఈ(ఆపరేషన్) పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, షిర్డీసాయి వెటర్నరీ కాలనీ, చలపతినగర్, సంజీవినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

చైన్ స్నాచర్ అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ లక్ష్మణరావు

ఎంవీపీకాలనీ: ఎంఎంటీసీ కాలనీలో ఈ నెల 6వ తేదీ ఉదయం జరిగిన చైన్‌స్నాచింగ్ కేసులో నిందితుడిని ఎంవీపీ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ద్వారకా క్రైం ఏసీపీ లక్ష్మణరావు ఈ కేసు వివరాలను వెల్లడించారు. సుగ్గు జగదాంబ అనే మహిళ ఎంఎంటీసీ కాలనీలోని తన ఇంటి ఎదుట ఈ నెల 6న ఉదయం 5 గంటలకు పువ్వులు కోస్తుండగా.. గుర్తు తెలియని వ్యక్తి వాహనంపై వచ్చి ఆమెను బలంగా నెట్టేసి మెడలో ఉన్న ఒకటిన్నర తులాల గోల్డ్ చైన్‌ను లాక్కెళ్లిపోయాడు. ఈ ఘటనపై జగదాంబ కుమారుడు ప్రవీణ్‌కుమార్ ఎంవీపీ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ చక్రధర్ రావు నేతృత్వంలో స్థానిక సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలించి, నగరంలోని వివిధ ప్రాంతాల్లో అతడు సంచరించడాన్ని గుర్తించారు. నిందితుడి వాహనం నంబర్ ఆదారంగా పాతనేరస్తుడైన ఏవీఎన్ కళాశాల ప్రాంతానికి చెందిన నెమలి మణికంఠగా గుర్తించారు. నిందుతుడిని పట్టుకుని కోర్టుకు తరలించామని, అతడి నుంచి ఒకటిన్నర తులాల బంగారు గొలుసుతోపాటు పల్సర్–220 బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ తెలిపారు. సమావేశంలో సీఐ చక్రధర్ రావు, ఎస్ఐ అప్పలరాజు, ఏఎస్ఐ కిషోర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో ఆరోగ్యం

ఏయూక్యాంపస్: మహిళల ఆరోగ్యానికి సమతుల ఆహారం ఎంతో అవసరమని ఫిట్‌నెస్ శిక్షకురాలు యాస్మిన్ కరాచీవాలా అన్నారు. బీచ్ రోడ్డులో బుధవారం నిర్వహించిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రుచికరమైన ఆహారంతోపాటు పోషకాహారం తీసుకోవడం అవసరమన్నారు. మహిళలు తమ దినచర్యలో బాదంను భాగం చేసుకోవాలని సూచించారు. దీనిలో అత్యంత ముఖ్యమైన 15 రకాల పోషకాలు ఉంటాయన్నారు. మదర్స్‌డేను జరుపుకునే సమయంలో తల్లి గుండె ఆరోగ్యానికి ఉపకరించే ఆహారం ఎంపిక చేసుకోవాలని చెప్పారు. గుండె ఆరోగ్యానికి బాదం మేలు చేస్తుందని, దీనిని నిత్యం స్వీకరించాలని సూచించారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.13.50 లక్షలు

అల్లిపురం: ఆశీలమెట్ట దరి సంపత్ వినాయక దేవాలయం హుండీ ఆదాయం రూ.13,50,693 సమకూరినట్లు ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. ఈ మొత్తం 20 రోజులకుగాను లభించిందని పేర్కొన్నారు. అదే విధంగా 192 గ్రాముల 700 మిల్లీగ్రాముల వెండి, 19 యూఎస్ డాలర్లు, శ్రీలంక కరెన్సీ రూ.300 లభించాయన్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ టీఆర్ బోళస్, శ్రీ వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవదాయ శాఖ తనిఖీ అధికారి కె.గాయత్రి, దేవాలయ సిబ్బంది జి.గోవిందరెడ్డి, డీఎస్ ప్రసాద్, బ్యాంకు ఆఫ్ ఇండియా సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

20వ వార్డులో చెత్త తొలగింపు



పెదవాల్తేరులో చెత్త తొలగిస్తున్న సిబ్బంది

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డు పెదవాల్తేరులోని రోడ్లపై పేరుకుపోయిన చెత్తను బుధవారం పారిశుధ్య సిబ్బంది తొలగించారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మీ సురేష్ జీవీఎంసీ అధికారులతో మాట్లాడి వార్డులో పేరుకుపోయిన చెత్తను తొలగింపజేశారు. పొక్లెయిన్, లారీల ద్వారా చెత్తను డంపింగ్ యార్డ్‌కు సిబ్బంది తరలించారు.



భలే.. భలే.. తాటి ముంజెలు



పిఠాపురం కాలనీలో తాటి ముంజెలను విక్రయానికి సిద్ధం చేస్తున్న రైతు

మద్దిలపాలెం: వేసవి ఎండల సెగలతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. భానుడు ఉదయిస్తూనే భగ్గుమంటున్నాడు. దీంతో తీవ్రమైన ఎండతోపాటు చమటతో జనం విలవిల్లాడుతూ డీహైడ్రేషన్‌కు గురవుతున్నారు. ఇటువంటి సమయంలో తాజా తాటి ముంజెలు నగరవాసుల దాహార్తిని తీర్చడమే కాకుండా.. వేసవి తాపం నుంచి చక్కని ఉపశమనాన్ని అందిస్తున్నాయి. ప్రకృతి వరప్రసాదమైన తాటి ముంజల విక్రయాలు నగరంలోని ప్రధాన కూడళ్లు, వీధుల్లో జోరుగా సాగుతున్నాయి.

తాజా.. మజా..

మండు వేసవిలో లేత లేత తాటి ముంజెలు తింటే వచ్చే మజానే వేరు. పల్లెటూళ్లలో అయితే తాటిచెట్ల కాయల నుంచి ముంజలను తీసి ఆస్వాదిస్తూ తింటుంటారు. నగరంలో అయితే తాటి ముంజలు దొరకడాన్నే మహదానందంగా భావిస్తూ లెక్క పెట్టుకుని మరీ ఆరగిస్తుంటున్నారు. ఇంత ప్రత్యేకత ఉంది గనుకనే రైతులు ఏకంగా తాటికాయ గుత్తులను నగరానికి తీసుకొచ్చి ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద కుప్పలుగా వేసి విక్రయిస్తున్నారు.



నోరూరిస్తున్న తాటి ముంజెలు

జోరుగా విక్రయాలు

సీజనల్‌గా లభించే తాటి ముంజులను ఎలాగైనా తిని రుచి చూడాలని జనం ఉవ్విళ్లూరుతారు. వారి ఆసక్తి మేరకు రైతులు ఐస్ యాపిల్స్‌ను మహా నగరానికి తీసుకొచ్చి జోరుగా విక్రయాలు చేస్తున్నారు. కొందరు రైతులు ఒలిచిన ముంజులను బుట్టలో తలపై మోసుకుంటూ ఇంటింటికీ వెళ్లి అమ్ముతున్నారు. ప్రాంతాన్ని బట్టి డజన్ తాటి ముంజలు రూ.50 నుంచి రూ.100 వరకు ధర పలుకుతున్నాయి. ధర అధికంగానే ఉన్నా.. స్థానికులు బేరాలాడుతూ కొసరు అడిగి మరి తాటి ముంజలు కొంటున్నారు.

గీత కార్మికులకు ఉపాధి

గీత కార్మికులకు వేసవి వరంగా తాటి ముంజలు ఆర్థిక భరోసా ఇస్తున్నాయి. విజయనగరం శివారు బొండపల్లి తదితర ప్రాంతాల నుంచి ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వీటిని నగరానికి తీసుకుస్తున్నారు. ఇక్కడ ఎంచక్కా వాటిని వొలిచి తాజా ముంజులు విక్రయిస్తున్నారు. సమ్మర్ సీజన్ వచ్చిందంటే ఇలా నగరంలోని ప్రధాన కూడళ్లు, కాలనీల్లో తాటి ముంజుల విక్రయాదారులు సందడి చేస్తున్నారు. ప్రజలు వాటిని కొని తింటూ వేసవి తాపం నుంచి ఉపశమనంతోపాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందుతున్నారు.

ప్రయోజనాలు బోలెడు



- **వేసవిలో** ప్రకృతి సిద్ధంగా లభించే **తాటి ముంజెలు** తింటే బోలెడు ఆరోగ్య **ప్రయోజనాలున్నా**యి.
- **ఎంతో మృదువు**గా.. జెల్లిలా ఉంటూ నోరూరించే **తాటి ము**ంజలను ఐస్ యాపిల్ అని **కూడా పిలుస్తా**రు.
- **తాటి ముంజల్లో** శరీరానికి కావాల్సిన ఏ, బీ, **సీ, విటమిన్లు,** ఐరన్, జింక్, ఫాస్పరస్, **పొటాషియం వం**టివి పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.
- ముంజల్లో అధిక మొత్తంలో నీరు ఉండటం వల్ల శరీర బరువును తగ్గించడంలో ఎంతగానో తోడ్పడుతాయి.
- వేసవి తాపం నుంచి ఉపశమనం అందించి శరీరాన్ని చల్లగా ఉంచుతాయి. డీ హైడ్రేషన్‌ను నివారిస్తాయి.
- రుచికరమైన తాటి ముంజల నీరు, గుజ్జు పదార్థం తీసుకోవడం వల్ల యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి.
- రోగ నిరోధక శక్తిని పెంపొందించడానికి సహాయపడతాయి.
- చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ వీటిని తిని పలు రోగాల బారిన పడకుండా ఉండవచ్చు. ఇలా ఎన్నో ఉపయోగాలు తాటి ముంజల వల్ల పొందవచ్చు.

వాసవీ కన్యకాపరమేశ్వరికి విశేష పూజలు

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు వివేకానందనగర్‌లో ఆర్యవైశ్య సేవా సమైక్య ఆధ్వర్యంలో బుధవారం వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివేకానంద నగర్ సామాజిక భవనంలో నిర్వాహకులు అమ్మవారి చిత్రపటం, విగ్రహం ఏర్పాటు చేశారు. వందల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆర్యవైశ్య సేవా సమైక్య సభ్యులు సన్యాసిరావు, రాంబాబు, నాని, నాగేశ్వరరావు తదితరుల కుటుంబీకులతోపాటు వార్డులో రాజకీయ నాయకులు ముగడ రాజారావు, రాగతి అచ్యుతరావు, కృష్ణంరాజు తదిరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ముగ్గురు హెడ్ నర్సులకు పదోన్నతులు



ఉత్తర్వులు అందజేస్తున్న డాక్టర్ రాధారాణి

మహారాణిపేట: ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్ పోస్టుల కోసం బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. హెడ్ నర్సులుగా పని చేస్తున్న ముగ్గురికి గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్లుగా పదోన్నతులు లభించాయి. డి.కవిత (రీజినల్ కంటి ఆస్పత్రి), జి.చంద్రిక (పాడేరు ప్రభుత్వ ఆస్పత్రి), ఎం.ఇందిర (పాడేరు ప్రభుత్వ ఆస్పత్రి)లకు పోస్టింగులు ఇస్తూ వైద్యారోగ్య శాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ రాధారాణి ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా అధ్యక్షురాలు భవానీ తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ఘన నివాళి



ఏయూలో ఠాగూర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆచార్య వెంకటేశ్వర్లు, విద్యార్థులు



ఠాగూర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఏయూ విద్యావిభాగాధిపతి షారోన్ రాజు

విశాఖ విద్య: విశ్వ కవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా బుధవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఘన నివాళులర్పించింది. ఏయూ డాక్టర్ వీఎస్ కృష్ణ సెంట్రల్ లైబ్రరీలోని ఆయన విగ్రహానికి చీఫ్ లైబ్రేరియన్ ఆచార్య వెంకటేశ్వర్లు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి మాట్లాడారు. ఠాగూర్ గొప్ప రచయిత, చిత్రకారుడు, తత్వవేత్త, విద్యావేత్త, మానవతావాదని అన్నారు. గీతాంజలి ద్వారా సమాజ శ్రేయస్సును, దేశభక్తిని చాటారని కొనియాడారు. ఠాగూర్ కలలు కన్న భారతదేశాన్ని నిర్మించుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ స్వాతంత్ర్య తొలినాళ్లలో ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించడం, ఇక్కడి విద్యావేత్తలకు, విద్యార్థులకు దేశ ప్రగతిపై దేశానిర్దేశం చేయడం చరిత్రాత్మకమని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ వీఎస్ కృష్ణ సెంట్రల్ లైబ్రరీ ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఠాగూర్ ఆశయ సాధనకు పాటుపడాలి

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు అన్నారు. విద్యా విభాగం ఆధ్వర్యంలో ఠాగూర్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి షారోన్ రాజు పూలమాల వేసి అంజలి ఘటించారు. నేటికీ బీఈడీ, ఎంఈడీ విద్యార్థులకు ఠాగూర్ తత్వాన్ని, ఆలోచనలను అందిస్తున్నామని వివరించారు. ఠాగూర్ స్థాపించిన శాంతినికేతన్ విద్యా రంగానికి ఒక మార్గదర్శనంగా నిలిచిందని చెప్పారు. ఏయూను ఠాగూర్ సందర్శించి 'ద మేన్' అనే ప్రత్యేక ఉపన్యాసాన్ని అందించారని గుర్తు చేశారు. విద్యా విభాగం ఆచార్యులు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ పుష్పరాజ్యం, డాక్టర్ సౌమ్య హవేల, డాక్టర్ ప్రవీణ విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

వైజాగ్ ఎక్స్‌పోలో 'నయాగరా జలపాతం'



వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకుడు రాజారెడ్డి



నయాగరా జలపాతం నమూనా

ఏయూక్యాంపస్: నగరవాసులు, పర్యాటకులను అలరించే మరో కొత్త ఆకర్షణ విశాఖ తీరంలో ప్రత్యక్షమైంది. బీచ్ రోడ్డులోని పోలీస్ మెస్‌ను ఆనుకుని ఏర్పాటైన వైజాగ్ ఎక్స్‌పోలో నూతనంగా నయాగరా జలపాతం నమూనాను ఏర్పాటు చేశారు. దీనిని బుధవారం నిర్వాహకుడు రాజారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా ప్రవేశ రుసుమును రూ.150 నుంచి రూ.100కు తగ్గించినట్లు తెలిపారు. వైజాగ్ ఎక్స్ పో ప్రవేశం, జలకన్యలు, కశ్మీర్ సిటీ, నయాగరా ఫాల్స్ వంటి నాలుగు ప్రత్యేకతలను ఒకే టికెట్‌పై వీక్షించే అవకాశం కలిస్తున్నామన్నారు. వేసవి సమయంలో చిన్నారులకు అమితమైన ఆనందాన్ని కలిగించే రైడ్స్, మహిళలు ఎంతో ఇష్టపడే అలంకరణ వస్తువులు, కుటుంబమంతా సంతోషంగా గడిపే ఫుడ్ స్టాల్స్ అన్నీ ఒకే చోట ఏర్పాటు చేశామని చెప్పారు. వైజాగ్ ఎక్స్‌పోలో ప్రత్యేక ఆకర్షణగా 30 అడుగుల ఎత్తు, 181 అడుగుల వెడల్పు కలిగిన నయాగరా జలపాతం సెట్‌ను ఏర్పాటు చేశామన్నారు. విశాఖ వాసులతోపాటు పర్యాటకులు పెద్ద సంఖ్యలో దీనిని వీక్షించడానికి రావాలని కోరారు.

జీవీఎంసీ ఆస్తులు ధ్వంసం చేయడంపై ఆగ్రహం

కార్పొరేటర్ పీతల మూర్తి, అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్





పిఠాపురం కాలనీ పార్కులో అధికారులు తొలగించిన జిమ్ పరికరం, ఆట వస్తువులు



పార్కులో నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ ఆస్తులను ధ్వంసం చేయించిన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్, చేసిన డీసీపీ, టీపీఎస్, ప్లానింగ్ సెక్రటరీలపై చర్యలు తీసుకోవాలని 22వ వార్డు పిఠాపురం కాలనీ ప్రజలు కోరుతున్నారు. వారిపై తక్షణమే జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ హరేందర ప్రసాద్ క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. పిఠాపురం కాలనీ కళాభారతి రోడ్డులోని పార్కును జీవీఎంసీ అభివృద్ధి చేసి ఆట పరికరాలను ఏర్పాటు చేసింది. 20 ఏళ్లుగా స్థానిక ప్రజలు ఈ ఉద్యానవనంలో ఉదయం పూట వాకింగ్, సాయంత్రం వేళలో సేదతీరేందుకు పిల్లలతో కలిసి ఇక్కడికి వస్తూ ఉంటారు. ఈ పార్కు చుట్టూ అక్రమ వ్యాపారాలు ఉన్నాయని, ఆక్రమణలకు గురైందని కార్పొరేటర్ పీతల మూర్తి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు ఇచ్చారు. ఈ మేరకు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ డీసీపీ, టీపీఎస్ నారాయణ, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ జ్యోతి టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కలిసి బుధవారం మధ్యాహ్నం పార్కు వద్దకు వచ్చారు. అక్కడి జీవీఎంసీ ఆట వస్తువులు, వ్యాయామ పరికరాలను ధ్వంసం చేయడంతో స్థానికులు అక్కడికి చేరుకుని వారిని నిలదీసి, నిరసన వ్యక్తం చేశారు. కార్పొరేటర్ మూర్తి యాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకుంటున్నామని టౌన్ ప్లానింగ్ అధికారులు చెప్పగా.. కార్పొరేటర్‌కు పిల్లలు లేరని.. పార్కు, అందులోని ఆట పరికరాల విలువ ఇంకేం తెలుస్తుందని మూర్తిపై స్థానికులు మండిపడ్డారు. కార్పొరేటర్ మానసిక ఆనందం కోసం టౌన్ ప్లానింగ్ అధికారులు ఇంతలా బరితెగించాలా.. అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏంటీ అన్యాయమని స్థానికులు అడిగితే.. మూర్తితో మాట్లాడుకోండి.. ఆయనే ఫిర్యాదు చేశారని అధికారులు బదులివ్వడం విశేషం.

● ఏయూలో రక్షణ బలగాల మాక్ డ్రిల్

విపత్కర వేళ.. అప్రమత్తం ఇలా...







విశాఖలో కేంద్ర రక్షణ బలగాలు చేపట్టిన మాక్ డ్రిల్ ప్రజలను ఆలోచింపజేసింది. భారత్–పాకిస్తాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రజానీకాన్ని అప్రమత్తం చేయాలనే కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రక్షణ బలగాలు రంగంలోకి దిగాయి. విశాఖలోని డిఫెన్స్ వింగ్ (ఎన్‌డీఆర్ఎఫ్), ఎన్‌సీసీ సంయుక్తంగా బుధవారం ఆంధ్రా యూనివర్సిటీలో మాక్ డ్రిల్ నిర్వహించాయి. అత్యవసర సమయాల్లో ప్రాణాలు ఎలా రక్షించుకోవాలనేది కళ్లకు కట్టినట్లుగా రక్షణ బలగాలు తమ విన్యాసాలతో చూపించాయి. యుద్ధ సమయంలో శత్రువుల దాడుల నుంచి తప్పించుకుని, ఎలా సురక్షితంగా బయటపడాలనే దానిపై ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. యుద్ధ సమయంలో ఎలా వ్యవహరించాలనేది ఎన్‌సీసీ క్యాడెట్లు చేసి చూపించగా.., ఆపద సమయంలో ప్రజల ప్రాణాల రక్షణకు ఏ తీరుగా స్పందించాలనేది ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు వివరించాయి. అత్యవసర సమయంలో ప్రాణ రక్షణకు ఏం చేయాలి, పిల్లలు, పెద్దల్లో భయాన్ని తొలగించేందుకు ఎలా స్పందించాలి, గాయపడిన వారికి ఎలాంటి చికిత్స అందించాలి, హుటాహుటిన ఆస్పత్రికి తరలించడం వంటి సన్నివేశాలను కళ్లకు కట్టినట్లుగా చూపారు. మాక్ డ్రిల్ నేపథ్యంలో ఏయూ ప్రాంగణంలో ముందస్తు ఏర్పాట్లు చేశారు. వీసీ ఆచార్య రాజశేఖర్, రిజిస్ట్రార్ ధనుంజయరావు, ఎన్‌సీసీ విభాగాధిపతి యుగంధర్, అధిక సంఖ్యలో విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ముందు జాగ్రత్త చర్యలు, అత్యవసర సమయంలో ఎలా వ్యవహరించాలనే దానిపై ఎన్‌సీసీ అధికారి కల్నల్ తపస్ మండల్, డిఫెన్స్ వింగ్ అధికారులు అవగాహన కల్పించారు. – విశాఖ విద్య

అల్లూరి జీవితం స్ఫూర్తిదాయకం



అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్, ఆచార్యులు



అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంవీపీ నివాసితుల సంఘం నాయకులు



బీచ్ రోడ్డులో సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేస్తున్న లగుడు గోవిందరావు

విశాఖ విద్య: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుధవారం ఏయూ న్యాయ కళాశాల పక్కనే ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ పూలమాల వేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి జీవితం యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. విశాఖ జిల్లాతో అల్లూరికి ఎంతో అనుబంధముందని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం, డి.నాగరాజకుమారి, ప్రవేశాల సంచాలకులు డి.ఎ.నాయుడు, విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళి

ఎంవీపీకాలనీ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఎంవీపీ కాలనీ సెక్టార్–3 నివాసితుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. స్థానిక అల్లూరి విగ్రహానికి సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయని స్ఫూర్తితో యువత దేశానికి సేవలందించాలని పిలుపునిచ్చారు. సంఘ నాయకులు రవి కుమార్, రవిశంకర్ రాజు, శ్రీను, వాసు, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తిని కొనసాగించాలి

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లగుడు గోవిందరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అల్లూరి చూపిన తెగువ, ధైర్యం, సాహసం చరిత్రలో చిరస్థాయిగా నిలచిపోతాయన్నారు. ఆయన జీవితం ఎంతో స్ఫూర్తిదాయకమని, దానిని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో వెలమ సంఘం అదనపు ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల సత్యం, జిల్లా ఇన్‌చార్జి రెడ్డి ఈశ్వరరావు, అనకాపల్లి ఇన్‌చార్జి బర్ల పైడం నాయుడు, వరుదు రాజ్‌కుమార్, పెదిరెడ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిమ్మకాయల అలంకరణలో చిన పోలమాంబ



నిమ్మకాయల మాలలతో అలంకరించిన అమ్మవారు

మద్దిలపాలెం: శివాజీపాలెం, పీతలవానిపాలెం గ్రామదేవత చిన పోలమాంబ ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం నిమ్మకాయల అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు. వారికి కమిటీ సభ్యులు ప్రసాదం వితరణ చేశారు. ఈ నెల 13న జరగబోయే చిన పోలమాంబ జాతర మహోత్సవాలను విజయవంతం చేసేందుకు 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మీ సురేష్ విశేషంగా కృషి చేస్తున్నారు.